# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 30 మే, 2024 | పేజీలు : 03


## అమ్మ ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ



2 లో

# అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయండి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సిడిపివోలు, సూపర్‌వైజర్లు అత్యుత్తమ సేవలందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. బుధవారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో జిల్లాలోని సిడిపివోలు, ఏసిడిపిలు, సూపర్‌వైజర్లు, ఎంపిక చేసిన అంగన్‌వాడీ టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బందికి ప్రీస్కూల్ (ఎన్‌సిఎఫ్ఎఫ్ఎస్)పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. టీచర్లు తల్లులతో తరచూ మాట్లాడుతూ చిన్నారుల యోగ క్షేమాలు తెలుసుకోవాలని, తద్వారా అంగన్‌వాడీ కేంద్రాలపై మంచి అభిప్రాయం కలుగుతుందని పేర్కొన్నారు. సిడిపివోలు సూపర్‌వైజర్లు పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల నిర్వహణపైనే దృష్టి సారించాలని, బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణీలు, కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయాలని తెలిపారు. చిన్నారుల హాజరు శాతాన్ని పెంచేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. అంగన్‌వాడీల పనితీరు బాగుంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు. విధ్యార్థులు చదివేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారని చెప్పారు. అంగన్‌వాడీల్లో విద్య పూర్తికాగానే చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా టీచర్లు చొరవ చూపాలని సూచించారు. ఒక పద్ధతి ప్రకారం విధులు నిర్వర్తిస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఇంటింటా కుటుంబ సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తద్వారా చిన్నారులు, గర్భిణీల వివరాలు తెలుస్తాయని తెలిపారు. గర్భినీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంచి వైద్యం అందించే అవకాశం ఉంటుందుని చెప్పారు. అన్నింటికీ ఈ డాటా సరిపోతుందని చెప్పారు. అంగన్‌వాడీలో బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని సూచించారు. ప్రతి వారం సిడిపివోలు అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పనితీరును తెలుసుకోవాలని తెలిపారు. అధే విధంగా అంగన్‌వాడీల్లో హాజరు శాతం పెరిగేలా జిల్లా సమైక్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని 201 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఏదైనా అవసరముంటే పరిశీలించి చెప్పాలని సిబ్బందిని ఆదేశించారు. పక్కాగా వివరాలు చెబితే నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అంగన్‌వాడీలను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగిస్తూ చిన్నారులకు మంచి విద్యను అందించాలని సూచించారు. చిన్నారులకు గర్భిణీలకు పోషకాహారం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. టీచర్లు, ఆయాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీల బలోపేతంతోనే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ సూచించారు. పలు అంశాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపివోలు సవిత, తిరుమల, సౌందర్య, లక్ష్మణ్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ పి.జయశ్రీ, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ నాగరాజు, సిబ్బంది తదితరులున్నారు.




# మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం




### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, మంచిర్యాల డిసిపి అశోక్ కుమార్ కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి. రాములు, హరికృష్ణ, ఆబ్కారీ మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ చందన, మానసిక వైద్య నిపుణులు కె.సునీల్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, కేంద్ర పన్ను శాఖ అధికారి శ్రావణ్ కుమార్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఇతర అధికారులతో కలిసి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగం పూర్తి స్థాయిలో నిరోధించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమవుతాయని, విద్యార్థులకు మాదకద్రవ్యాలు, గంజాయి ఇతరత్రా మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని, అసాధారణ ప్రవర్తన కలిగిన విద్యార్థులను గుర్తించి కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకురావాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించడానికి వసతిగృహాలు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను డ్రగ్స్ (మద్యం, గంజాయి, సిగరెట్లు ఇతరత్రా) ప్రభావితం చేసే ప్రక్రియను గుర్తించి సమచారాన్ని సేకరించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రగ్స్ సంబంధిత విషయాలపై చికిత్స కోసం వచ్చిన వ్యక్తులను గుర్తించి, ఆ వ్యక్తి నుండి పూర్తి సమాచారాన్ని పొందేందుకు ఆరోగ్య శాఖ ముఖ్య పాత్ర పోషించాలని, పునరావాస కేంద్రాలను నిర్వహించాలని తెలిపారు. ఆబ్కారీ మద్యనిషేధ, ఆదాయ పన్ను శాఖలు సమన్వయంతో చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని, డ్రగ్స్ స్పాట్ ్సను గుర్తించి తనిఖీలు చేపట్టి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిడిపిఒలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా మండల స్థాయి అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కమీషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తుందని, ఇప్పటి వరకు 22 కేసులు నమోదు చేయడం జరిగిందని, ప్రధానంగా డ్రగ్స్ ఉత్పత్తి, రవాణాను అరికట్టడంలో టాస్కోర్స్ బృందాల ద్వారా చెక్పోస్ట్ వద్ద విస్తృత తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని షీ టీంలకు కేటాయించడం జరిగిందని, 2024 సంవత్సరంలో గడిచిన 4 నెలల కాలంలో 14 కిలోల గంజాయిని సీజ్ చేశామని, బెల్లంపల్లిలోని ఓ ప్రాంతంలో 10 నుంచి 15 గంజాయి మొక్కలు ఉన్నట్లు గుర్తించి, సీజ్ చేయడం జరిగిందని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని, పట్టణ ప్రాంతాలు, కాలనీలు, పాఠశాలలు, హోటళ్ళు, విక్రయ ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ జిల్లా సర్వేయలెన్స్ అధికారి డా ఫయాజ్ఖాన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వచ్చే నెల 9వ తేదీన గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని మినీ మీటింగ్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్ తో కలిసి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాన్నం 1:00 గంట వరకు కొనసాగే గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లాలో 4699 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా నెలకొల్పిన కంట్రోల్ రూమ్ 9398684240 నెంబర్ కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

### ముందుగానే చేరుకోవాలి

పరీక్ష కేంద్రాలలో డెస్క్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలలో సిసి కెమరాలను ఏర్పాటు చేయాలని, ప్రశ్నపత్రాలను పంపిణి మొత్తం సిసి కెమరాల ద్వారా కెమరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు వచ్చే దివ్యంగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని, అలస్యం అయిన వారిని పరీక్షకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రతి పరీక్షా కేందద్రంవద్ద మంచినీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా చూడాలని, ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా ముందుగానే సరిచూసుకోవాలని పేర్కోన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షను వ్రాసే వారితొ పాటు ఇన్ విజిలేటర్లకు సైతం అనుమతిలేదని తెలిపారు. ఒక్క చీఫ్ సూపరిండింట్ వద్ద తప్ప ఎవ్వరి మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ సరఫరా లో ఎలాంటి లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# లేబర్ కమిషనర్ సింగరేణిలో పర్యటించాలి

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సింగరేణిలో వివిధ భాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పూర్తి స్థాయిలో కార్మిక చట్టాలు అమలు కాక నష్టపోతున్నారని, లేబర్ కమిషనర్ సింగరేణి వ్యాప్తంగా పర్యటించి కార్మిక చట్టాలు, కనీస సౌక ర్యాలు ఏ స్థాయిలో అమలవుతున్నాయో తెలుసుకొని, వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌సికెఎస్‌సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఇందారం లోని ఓబిలో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులు ఏర్పాటు చేసిన ద్వారా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఓబిలలో పనిచేస్తున్న బ్లాస్టింగ్, వోల్వో డ్రైవర్స్, డంపర్ ఆపరేటర్లకు సరైన సౌక ర్యాలు, కనీస వేతనాలు అందక తీవ్ర ఇబ్బందుల పాలవుతు న్నారన్నారు. కార్మిక చట్టాలు తెలియక అనేక విధాలుగా ఆర్థి కంగా నష్టపోతున్నారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులపై తీవ్రమైన పని ఒత్తిడి, కక్ష సాధింపు చర్యలు, పని భద్రత లేకుండా చేయడం వంటి అనేక చర్యలకు పాల్పడుతున్నారు. వీటిపై ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకునే అధికారులే లేరని విమర్శించారు. ఈ నిర్లక్ష్యం మూలంగా కార్మికులకు చట్టాలు అమలు కావడం లేదుని, ఇలాంటి పరిస్థితులలో కార్మికులకు భరోసా ఇచ్చే విధంగా లేబర్ కమిషనర్ పర్యటించి క్షేత్రస్థాయిలో కార్మిక చట్టాలు అమలుకు కృషి చేయడం వలన కాంట్రాక్ట్ కార్మికులకు ప్రయోజనం చేకూరు తుందని కోరారు.ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ

### అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



ప్రజాపక్షం/శంకరపట్నం : మండల పరిధిలోని అంబాలాపూర్ గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణం పనులను బుధవారం జిల్లా అదనపు కలె క్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అమ్మ ఆదర్శ పాఠశాల పనులు విద్యుత్ మంచినీటి సరఫరా టాయిలెట్స్ పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ పనులను పరిశీ లించి వేగవంతంగా పూర్తి చేయాన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు, ఎంపిడిఓ శ్రీవాణి, ఎంపివో బషీరుద్దీన్, ఏఈ పిఆర్ తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

## కోరం లేక మండల సమావేశం వాయిదా

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపి డిఒ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. బుధవారం ఉదయం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తు న్నట్లు ఆయన తెలిపారు. సర్వసభ్య సమావేశం తేదీని త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి



ప్రజాపక్షం/జైనూర్ : కొమురం భీం జిల్లా జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేస్రం లక్ష్మణ్ బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం రాత్రి గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధ వారం మరణించినట్లు ఆయన కుటుంబీకులు తెలి పారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతిని ధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## పల్లె ప్రగతి పనులు పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి..



ప్రజాపక్షం/ఖానాపూర్ : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురా చందు నాయక్ తాండ, గ్రామ పంచాయతీలను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన, ఆయా గ్రామ పంచాయతీ లోని స్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీ లించి. స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు. సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులు, పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, పంచాయతీ అధికారులు ఉన్నారు.



## నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు



ప్రజాపక్షం/ఇల్లందకుంట : ఇల్లందకుంట మండలం లోని రాచపల్లి గ్రామంలో డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా (బిసిఐ) ఉత్తమ పత్తి యాజమాన్య పథకం నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఉచిత భూసార పరీక్షా మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిఐ క్షేత్ర సిబ్బంది రావుల రాకేష్ మాట్లాడుతూ మానవులకు రక్త పరీక్ష ఏవిధంగానో అదే విధంగా నేల తల్లికి మట్టి పరీక్ష అంత అవసరం కాబట్టి రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుని నేల ఆరోగ్యస్థితి ఎలా ఉందో తెలుసుకో వాలన్నారు. అందులో బాగంగా నేలలో ఉన్న నత్రజని, ఫాస్పరస్, పొటాషియం వంటి స్థూల పోషకాల సామర్ధ్యం తెలుసుకుని వాటి ఫలితాలు ఆధారంగా సూచించిన మోతాదులో సూచించిన పద్ధతులు పాటిస్తూ ఎరువులు వాడుకోవాలని , చెరువు మట్టి ,పశువుల పెంట వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిసిఐ క్షేత్ర సహాయకులు అనిల్, మోహన్ పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం

ప్రజాపక్షం/గంగాధర : మండలంలోని కాసారం, నారాయణపూర్, నర్సింహులపల్లి, రంగారావుపల్లి, వెంకటాయపల్లి గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయ అధికారి బంద రాజు ఆధ్వర్యంలో రైతులకు పత్తి, ఇతర పంటల కల్తీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అదే విధంగా తప్పనిసరిగా రసీదు తీసుకుని పంట కాలం అయిపోయే వరకు రసీదు, విత్తన సంచి జాగ్రత్తగా ఉంచాలని రైతులకు సూచించారు. అలాగే గ్రామాలలో



ఎవరైనా లూజ్‌గా సంచులలో లేబుల్ లేకుండా తక్కువ, ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే రైతులు వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సుమాంజలి, గోపిచంద్, వంశీధర్, అనంత రాజు, వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి మోక్షం ఎప్పుడు?



ప్రజాపక్షం/చిగురుమామిడి : చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు గ్రామంలో మహిళలు పాదయాత్ర చేసి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఘనత కలిగిన చైతన్యవంతమైన గ్రామల్లో మహిళా సమైక్య సొంతభవనం లేకపోవడం చాలా బాధాకరమని యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చట్ల సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వంద స్వశక్తి సంఘాలు, 4 గ్రామైక్య సంఘాలు కలిగిన గ్రామంలో గత ప్రభుత్వం వారి బాధలు కనీసం పట్టించుకోలేదన్నారు. నిధులు కేటాయించినప్పటికీ భవనం నిర్మించలేకపో వడం వారు చేసిన నిర్లక్ష్యానికి నిదర్శన మన్నారు. ఫలితంగా మహిళలు ఇబ్బం దులకు గురవుతున్నారన్నారు. ఇప్పటి కైనా నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా వారికి సొంత భవనం ఏర్పాటు చేసి మహిళా సంఘా లకు అందదండగా ఉండాలని , వారి సంక్షేమం కొరకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేయాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

## ఖాదీ ఆవరణలో కళావేదికను పునఃనిర్మించాలి



ప్రజాపక్షం/మెట్ పల్లి : ఖాదీ గ్రామోద్యోగ్ సంస్థ ఆవరణలోని తొలగించబడిన కళా వేదికను పునః నిర్మాణం చేయించాలని లలిత కళా సమితి కళాకారులు అన్నారు. మెట్ పల్లి పట్టణంలో ఖాదీ ఆవరణలో బుధవారం కళాకారులు నిరసన వ్యక్తం తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దశాబ్దాల కాలంగా ఖాదీ ప్రతిష్ఠ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు మన మెట్ పల్లి క్లబ్ ద్వారా నాటక ప్రద ర్శనలకు శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలకు నీలమైన మన మెట్ పల్లి పట్టణ కళా రంగ కీర్తి వైభవాన్ని నాలుగు దశాబ్దాల. వ్యాప్తికి ఆధారమైన కేంద్ర బిందువు అయినా కళావేదిక తొలగించబడడం చాలా బాధాకర మని తెలిపారు. ఖాదీ ఆవరణలో పెట్రోల్ బంక్ పక్కన ఖాళీ స్థలంలో కళావేదిక నిర్మాణం చేసి పూర్వ వైభవాన్ని పునః ప్రతిష్టించి. భవిష్యత్తు తరాలకు మెట్ పల్లి కళా సాంస్కృతిక వారోత్సవాల వేదికగా అందించగలరని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కళా సాహిత్య సంస్థల ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించాలి



ప్రజాపక్షం/ఇచ్చోడ : గ్రామాల్లో ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరణ చేసి, కంపోస్ట్ షెడ్డుకు తరలించాలని స్థానిక ఎంపీడీవో కొండ లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలోని మాన్కపూర్, చించోలి, గుండి వాగు గ్రామాల్లో బుదవారం వన నర్సరీ, కంపోస్ట్ షెడ్లు, ఉపాధి హామీ పనులను సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తరలించిన చెత్త ద్వారా సేంద్రీయ ఎరువు లను తయారీకి విని యోగించుకోవాలనీ అన్నారు. చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలనీ సూచించారు. ఖరీఫ్‌లో వర్షాలు కురిసిన తరువాత మొక్కలను నాటి, వాటిని పెంచేందుకు ప్రణాళికల ను సిద్ధం చేస్తున్నామని, పచ్చ దనం పెంపు కోసం కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయ గ్రామ పంచాయ తీల కార్యదర్శులు, ఈజీఎస్ క్షేత్ర స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాలిసుగ్రీవ రామాలయంలో సీతారామ కళ్యాణమహోత్సవం

### ఎంఎల్ఎ కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రజాపక్షం/శంకరపట్నం : మండల పరిధిలోని కన్నాపూర్ గ్రామ శివారులో శ్రీవాలి సుగ్రీవ రామాలయంలో బుధవారం సీతారామ స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరి గాయి. ఈ వేడుకలకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్తారం గ్రామంలో గుట్టపై ఉన్న సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మొక్కినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, మండల మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ, కుమార్, మహేష్, రమేష్, సంతోష్ తదితరులున్నారు.

## ఎస్‌సి గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : అసిఫాబాద్ ఎస్‌సి గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సిఒఇ విద్యాలయాల్లో 202425 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ ఉటూరి శ్రీనాద్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 31 వరకు గురుకుల సొసైటీ వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికే అవకాశం కల్పించినట్లు తెలి పారు. దరఖాస్తు రుసుం కింద ఆన్ లైన్‌లో రూ.100 చెల్లించాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు కొరకు https://www. tswreis. ac. in వెబ్ సైట్‌ని సంప్రదించాలని తెలిపారు.

